క్లుప్తంగా

మహిళలకు వైద్య శిబిరం



రాయకుదురులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాయకుదురు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో స్వస్థ నారీ సశక్తి పరివార అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య శిబిరం నిర్వహించారు. రాయకుదురు సర్పంచ్ గెద్దం భారతి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్, పరీక్షలను నిర్వహించారు. అలాగే గర్భిణులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.ప్రసాద్, కె.మంగతాయారు, లీల, సౌజన్య, అపర్ణ, గెద్దం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: మండలంలోని గొరగనమూడి గ్రామపంచాయతీ వద్ద స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని సర్పంచ్ గొట్టుముక్కల వెంకట శివరామరాజు(శివాజీ రాజు) మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ మహిళలకు 14 రకాల వైద్య పరీక్షలను చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జె. లీలా లక్ష్మి, డాక్టర్ హషిత, ఇంజేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్నల్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ హ్యాకథాన్

భీమవరం: స్థానిక డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్నల్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ హ్యాకథాన్ మంగళవారం విజయవంతంగా ముగిసింది. రెండు రోజుల పాటు నిర్వహించిన హ్యాకథాన్‌లో విద్యార్థుల బృందాలు సమస్యా ప్రకటనలపై ఆలోచనలు సమర్పించగా వాటిలో మూడు ఉత్తమ బృందాలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), కన్వీనర్ ఎస్.రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

దసరా పండుగ విజయానికి నాంది



దసరా శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): దసరా పండుగ విజయానికి నాంది అని, విజయీభావ యాత్ర ధరిత్రిని శాంతి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం వెంకట్రామ థియేటర్ రోడ్డులో భక్తులతో దసరా విజయీభావ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, బిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్, టీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు వెండి ఆభరణం సమర్పణ



కోపల్లెలో అమ్మవార్లకు వెండి ఆభరణాన్ని సమర్పిస్తున్న దాతలు

కాళ్ల: అమ్మవార్ల ఆలయ అభివృద్ధికి దాతలు సహకారం అభినందనీయమని ఉపసర్పంచ్ బూడి వెంకటపరాలు అన్నారు. మండలంలోని కోపల్లెలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ, శ్రీ పరాలమ్మ అమ్మవార్లకి గ్రామానికి చెందిన నీటి సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి రాధాకృష్ణంరాజు, రమావతి దంపతులు, కుటుంబ సభ్యులు కేజీ వెండితో (సుమారు రూ.1.67లక్షలు) చేసిన పులి ఆభరణాన్ని సమర్పించారు. ఈ ఆభరణాన్ని మంగళవారం అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

కొడుకుపై తండ్రి ఫిర్యాదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అన్యాయంగా తన మనిషిని తన కొడుకు కొట్టాడంటూ తండ్రి ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన ముదునూరి సుందరరామరాజుకు రేకుల షెడ్డు ఉంది. ఆ షెడ్డుకు కాపలాగా చిట్టెం వెంకన్నను నియమించుకున్నాడు. అయితే ముదునూరి సుందరరామరాజు కుమారుడు వెంకట సుబ్బరాజు తన ఆటోను రేకుల షెడ్డు వద్ద పెట్టాడు. కాపలాగా పెట్టుకున్న చిట్టెం వెంకన్న రేకుల షెడ్డు వద్ద ఆటో తీసేయాలని వెంకట సుబ్బారాజుకు చెప్పాడు. వెంకట సుబ్బరాజు నీవు ఎవరూ నాకు చెప్పడానికి అంటూ ఆయనపై దాడి చేశాడు. దీంతో తండ్రి సుందర రామరాజు పోలీసులను ఆశ్రయించాడు.

ప్రయాణ ఇక్కట్లు తీరేదెన్నడు?



ఉండిలో ఆర్‌ఓబీ పనులు చేస్తున్న దృశ్యం





పాములపర్రు-పెదకాపవరం రోడ్డు దుస్థితి

- ఉండిలో రహదారుల దుస్థితిపై వాహనదారులు, ప్రయాణికుల ఆందోళన
- ఆర్‌ఓబీ పనులతో వాహనదారుల నరకయాతన

ఉండి: ఒకవైపు వెళ్ళేందుకు లేదు మరోవైపు వెళ్లాలంటే రోడ్డు లేదు. కేవలం భారీ గుంతలు, చెరువులను తలపిస్తున్న రోడ్డులో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, లారీలు, కార్లు చివరకు ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేకపోతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాములపర్రు, పెదకాపవరం రహదారి అత్యంత అధ్వానంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 18న ఉండి రైల్వేగేటు వద్ద ఆర్వోబీ పనులు ప్రారంభించడంతో కనీస సమాచారం లేకుండానే జాతీయ రహదారిపై ఉన్న రైల్వేగేటు మూసేసి పనులు నిర్వహిస్తున్నారు. ఉండి సెంటర్‌లో ఒకబ్యానర్, పెదపుల్లేరు వంతెన వద్ద ఒక బ్యానర్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్ మళ్లింపు చేశామని వాహనదారులకు సూచనలు చేసిన అధికారులు చేతులు దులుపుకున్నారు. ముఖ్యంగా పాములపర్రు నుంచి ఆకివీడు చేరుకునేందుకు ప్రయాణించాల్సిన రహదారి చెప్పలేనంత దారుణంగా ఉంది. రహదారి అని చెప్పేకంటే చెరువు లేదా సరస్సు అనే పేర్లు పెడితే బాగుంటుందని చమత్కరించుకున్నారు. ద్విచక్రవాహనం కూడా దిబడిపోయేంత భారీ గుంతలు ఈ రోడ్డులో ఉన్నాయి. అలాగే రహదారి వెంబడి భారీ డ్రెయిన్ ఉండటంతో వాహనాలు అదుపు తప్పి డ్రెయిన్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.

మరో దారి అంతే

ఉండి నుంచి వాంద్రం, పెదపుల్లేరు మీదుగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసిన రోడ్డు కూడా దారుణంగా మారిపోయింది. ఆర్‌ఓబీ పనులు పుణ్యమా అని మండలంలోని రహదారుల బండారం బయటపడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఆకివీడు పరిసర ప్రాంతాల నుంచి ఉండి మీదుగా ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో స్కూల్ బస్సులు,ఆటోలు విద్యార్థులను తీసుకుని భీమవరం వెళ్తుంటాయి. అయితే ఇప్పుడు ఆర్‌ఓబీ పనుల వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దసరా సెలవుల దృష్ట్యా పాఠశాలలకు సెలవులు ప్రకటించినా కళాశాలల బస్సులు ఇదే రహదారిలో వెళ్లాల్సి వస్తుంది. ముఖ్యంగా ఈ దారిలో ఆటోలు వెళ్లేందుకు కూడా అవకాశం లేకపోవడంతో పలువురు ప్రయాణికులు వేదన పడుతున్నారు.

ప్రమాదంలో ప్రజల ప్రాణాలు



పాములపర్రు-పెదకాపవరం రోడ్డు చాలా భయంకరంగా మారిపోయింది. ఉండి ఆర్‌ఓబీ పనులు చేపట్టి ఇలాంటి రోడ్డులో ట్రాఫిక్ డైవర్షన్ చేయడం దారుణం. ట్రాఫిక్ మళ్లించేటప్పుడు అధికారులు కనీస పరిశీలన చేలేదు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

– వర్రే పైడియ్య, మాజీ ఎంపీటీసీ, పాములపర్రు

రోడ్ల పరిస్థితి అధ్వాన్నం



మండలంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఉండి సెంటర్ నుంచి గణపవరం రోడ్డు, ఆపై పాములపర్రు, పెదకాపవరం, ఆకివీడు రోడ్డు, ఉండి అర్తమూరు, ఉండి కవిటంపాకల ఇలా చెప్పుకుంటూ పోతే అనేకరోడ్లు ఉన్నాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వర్షా కాలంలో ప్రజలు, ప్రయాణికుల పరిస్థితి దారుణంగా మారింది.

– అంగర రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, ఉండి

సిమెంట్ బెంచీల ఏర్పాటు

భీమవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్‌కు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు సిమెంట్ బల్లలు, 100 నోట్ పుస్తకాలు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా లయన్స్ రీజినల్ చైర్‌పర్సన్ వీవీ కృష్ణంరాజు, క్లబ్ అధ్యక్షుడు బొండా రాంబాబు మాట్లాడుతూ పి.సుభాష్‌బాబు ఆర్థిక సహకారంతో బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్ పర్సన్ నడింపల్లి మహేష్‌కుమార్ వర్మ, కార్యదర్శి అల్లు తులసి ప్రసాద్, కోశాధికారి కనకర్ల విజయ రామకృష్ణ, తటవర్తి బదరీ పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై అప్రమత్తత అవసరం

భీమవరం అర్బన్: కళ్లకు సోకే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణరాణి అన్నారు. మండలంలోని గొల్లవానితిప్పలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 22 మందికి కంటి శుక్లాలు దెబ్బతినడంతో రాజమండ్రి సిద్ధార్థ నర్సింగ్ హోమ్‌కి పంపుతున్నట్లు చెప్పారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



భీమవరం అర్బన్: కొమరాడలో మాట్లాడుతున్న ఏడీఏ కె. శ్రీనివాస్



ఆకివీడు: మిల్లు వద్ద ధాన్యం సంచులను పరిశీలిస్తున్న అధికారులు

భీమవరం అర్బన్: ఖరీఫ్ ధాన్యం విక్రయంలో దళారులు, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని ఏడీఏ కె. శ్రీనివాస్ రైతులకు సూచించారు. మండలంలోని కొమరాడ గ్రామంలో మంగళవారం ఖరీఫ్ ధాన్యం కొనుగోలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2389, అదే సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధర ప్రకటించందన్నారు. ఈ-పంటలో రైతులు పేర్లు నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తారన్నారు. మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ రైతులు కోరుకున్న మిల్లులకే ధాన్యం తరలించుకోవచ్చన్నారు. ట్రక్ షీట్ జనరేషన్ కాకుండా రైస్ మిల్లులకు నేరుగా ధాన్యాన్ని తరలించకూడదన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కె.శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షుడు గంజాల మాణిక్యాలరావు, సర్పంచ్ రాట్నాల పేరయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: మండంలలోని సీసలి గ్రామంలో ధాన్యం కొనుగోలుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.రమేష్ నాయుడు మాట్లాడుతూ వరి పండించే రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఉండిలో..

ఉండి: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ఇప్పటి నుండే ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాస్ తెలిపారు.మంగళవారం మండలంలోని ఉప్పులూరు, ఉణుదుర్రు గ్రామాల్లో ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన కలిగించారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యర్రా దుర్గారావు,నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంచుల పరిశీలన

ఆకివీడు: ఖరీఫ్ ధాన్యం సేకరణకు అవసరమయ్యే సంచుల్ని అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించడంతో మంగళవారం స్థానికంగా రైస్ మిల్లులను ఇన్‌చార్జి తహసీల్దార్ ఫరూక్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. పలు రైస్‌మిల్లుల్లో సంచులు అందుబాటులో ఉన్నాయని, కొనుగోళ్లు మొదలైయ్యే సమయానికి పూర్తి స్థాయిలో సంచులు అందుబాటులోకి తీసుకువస్తామని మిల్లర్లు తెలిపినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులు, వీఆర్వో బందా హరిశ్చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలు



ఎస్ఆర్‌కెఆర్‌లో హ్యాకథాన్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి, 12 గంటల పాటు నిర్విరామంగా జరిగే పోటీల్లో 1,800 మంది విద్యార్థులు 300 టీమ్స్‌గా పాల్గొంటున్నట్లు కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు తెలిపార. హ్యాకథాన్ పోటీల్లో ప్రధానంగా స్మార్ట్ ఆటోమేషన్, అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ, గ్రామీణ అభివృద్ధి, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్, క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీ, ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్, రోబోటిక్స్ అండ్ డ్రోన్స్ స్మార్ట్ ఎడ్యుకేషన్ వంటి వాటితో సమాజానికి ఉపయోగపడే సమస్యల సాధనకు మార్గనిర్దేశకత్వం చూపే విధంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపొందించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కేవీ మురళీ కృష్ణంరాజు, హేక్తాన్ కోఆర్డినేటర్ ఎస్.గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

భీమవరం: ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సమాజ సేవలో ముందుండాలని భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన అన్నారు. మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక, ఆర్‌ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ భావాలను పెంపొందిస్తుందన్నారు. 24న కేజీఆర్ఎల్ కళాశాలలో నిర్వహించే ముగింపు కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లకు సత్కారాలు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందిస్తామన్నారు. ముందుగా 400 అడుగుల జాతీయ జెండాతో జాతీయ సమైక్యత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూజీసీ కో-ఆర్డినేటర్ పి.అరవిందస్వామి, లైబ్రేరియన్ ఎల్.నర్సింహమూర్తి, జి.ఉమామహేశ్వరి, జీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగుల ఆసుపత్రుల సందర్శన



రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న జడ్జి సురేష్‌బాబు

భీమవరం: పట్టణంలోని మానసిక రోగుల ఆసుపత్రులను ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎ.సురేష్‌బాబు సందర్శించారు. మంగళవారం శాంతి, ప్రశాంతి, వర్మ మానసిక రోగుల ఆసుపత్రులను సందర్శించి రోగుల ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయపరమైన సలహాలు సూచనలు అవసరమైతే న్యాయసేవా సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయవాదిని నియమిస్తామన్నారు. మానసిక వైద్యులు జీవీ రమణరావు, మాదిరెడ్డి వెంకటరమణ, శ్రీదేవి మానసిక వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న చికిత్స, డిప్రెషన్‌ను పోగొట్టడానికి తీసుకుంటున్న చర్యలను న్యాయమూర్తికి వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు సుధీర్, జ్యోతి, రవికిరణ్, మీడియేషన్ న్యాయవాది విజయలక్ష్మి పాల్గొన్నారు.

దొంగతనాలపై జాగ్రత్త అవసరం

ఉండి: దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని మండల ప్రజలంతా దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పండుగలను పురస్కరించుకుని బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో విలువైన ఆభరణాలు, వస్తువులు ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రం చేసుకోవాలని సూచించారు. ఇళ్లకు వేసే తాళాలు బయటకు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లాక్‌హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా మీ ఇంటికి పోలీసులు భద్రత కల్పించడంతో పాటు ఉచితంగా సీసీ కెమెరాను మీ ఇంట్లో ఏర్పాటు చేస్తారని వివరించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు లేదా 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

ముంపు నీటితో ఇబ్బందులు



ముంపునీటిలో ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ స్కూల్



పాఠశాల ఆట స్థలంలో నిలిచిన నీరు

ఆకివీడు: వర్షపు నీటికి ఎంపీపీ పాఠశాల ప్రాంగణం నీట మునిగింది. మండలంలోని అజ్జమూరు గరువు ప్రాంతంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణం నీట మునగడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందికరంగా మారిది. పాఠశాలకు చేర్చి కాల్వ ఉండటంతో భారీ వర్షానికి కాలువలోనీరు పొంగి పాఠశాలను ముంచెత్తుతోంది. ముంపు బెడదతో ఉన్న పాఠశాల దుస్థితిపై ప్రధానోపాధ్యాయులు ఆర్వీ.ఎస్.నారాయణ మాట్లాడుతూ దుక్కి వర్షానికి పాఠశాల ప్రాంగణం మునిగిపోతుందన్నారు. విద్యార్థులు వర్షపు నీటిలోనుండే పాఠశాలకు వస్తున్నారని చెప్పారు. ముంపునీటితో పాఠశాలలోకి పాములు వస్తున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. పాత భవనం కావడంతో పెచ్చులూడి పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



భీమవరం(ప్రకాశం చౌక్): బాలాత్రిపుర సుందరి దేవిగా పార్వతి దేవి



కాళ్ల: కాళ్ళకూరులో ధాన్యలక్ష్మి అలంకరణ



ఆకివీడు: గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న దుంపగడప గేటు వద్ద కనకదుర్గమ్మ

కాపాడమ్మా.. కనకదుర్గమ్మ

దసరా ఉత్సవాలను పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లో వైభంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని మంగళవారం బాలా త్రిపుర సుందరీ దేవిగా, గాయత్రీ దేవిగా అలంకరించారు. కొన్ని ఆలయాల వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. దసరా సెలవుల నేపథ్యంలో పిల్లలు ఇంట్లో ఉండడంతో ప్రతి ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



వీరవాసరం: అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు



భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీరామపురంలో ప్రత్యేక అలంకరణ

శాంతియుత పర్యటనను అడ్డుకోవడం దారుణం

భీమవరం: ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారి గూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ నిల్వ కేంద్రం ఏర్పాటును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా గ్రామాల్లో పర్యటిస్తున్న గిరిజనులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడాన్ని సీపీఐ జిల్లా జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేవీ ఆయుధ నిల్వ కేంద్రం వద్దంటూ గ్రామ సభ, పీసా కమిటీ రెండు, మూడు దఫాలు తీవ్రంగా వ్యతిరేకించినా ప్రభుత్వం ఆయుధ కర్మాగారం పెట్టితీరుతామని ప్రయత్నాలు చేయడం దారుణమని మండిపడ్డారు.

కోపల్లెలో ‘స్వచ్ఛోత్సవ్’

కాళ్ల: మండలంలోని కోపల్లెలో ‘స్వచ్ఛోత్సవ్’ కార్యక్రమాన్ని బీజేపీ నేతలు మంగళవారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మూర్తి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వారోత్సవాలను సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పానకాలకృష్ణ, సుంకర కాశీ విశ్వేశ్వరావు, ఉపసర్పంచ్ బూడి వెంకటపరాలు పాల్గొన్నారు.

రాయకుదురు సొసైటీ చైర్మన్‌గా తోట

వీరవాసరం: రాయకుదురు విశాల సహకార పరపతి సంఘం(సొసైటీ) తీసభ్య కమిటీ చైర్మన్‌గా తోట విజయ్ కుమార్ (బుజ్జి) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ పురోభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి యల్లబండి శ్రీనివాస ప్రసాద్, డైరెక్టర్ జుత్తిగ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామ్ చంద్రమూర్తి, తోట ఆదిబాబు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాపు తనిఖీ

ఆకివీడు: స్థానిక దొరగారి చెరువుగట్టు నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న కూల్‌డ్రింక్ షాపును మంగళవారం జిల్లా ఆహార భద్రతా శాఖ అధికారి సుందరరామి రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాదం తయారీ ప్యాకెట్లను పరిశీలించి, పరీక్షల నిమిత్తం రెండు ప్యాకెట్లను సీజ్ చేశారు. షాపులో ఆహార భద్రత అనుమతి ధ్రువపత్రం లేదని రామిరెడ్డి చెప్పారు. షాపులో పరిశుభ్రత, ఇతరత్రా అన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు. శాంపిల్స్‌లో లోపాలుంటే కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

మద్యం షాపులు, బార్లలో ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చర్యలు

భీమవరం: పట్టణంలోని మద్యం దుకాణాలు, బార్లల్లో వినియోగదారులకు ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని బార్లు, మద్యం దుకాణాదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామరాజు మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలన్నారు. మద్యం షాపులు, బార్లలో సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలని వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ వంటివి ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించడం పూర్తిగా మానుకోవాలని కోరారు.

29 నుంచి షటిల్ టోర్నమెంట్

ఉండి: దసరా పర్వదినాలను పురస్కరించుకుని ఉండిలోని కలిదిండి రామచంద్రరాజు జన్మభూమి పార్క్‌లో ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నియోజకవర్గస్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలు ఓపెన్ ప్లేయర్స్, 30 ప్లస్, 40 ప్లస్ ఇలా మూడు విభాగాలుగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 29న ఓపెన్ ప్లేయర్స్, 30న 30 ప్లస్ ప్లేయర్స్, సెప్టెంబర్ 1న 40 ప్లస్ ప్లేయర్స్‌కు పోటీలు నిర్వహిస్తున్నాని వివరించారు. వీటిలో ఫైనల్స్‌కు చేరిన వారికి 2న ఫైనల్స్ నిర్వహించి బహుమతులు అందజేస్తామని వివరించారు. ప్రతి విభాగంలోనూ మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు చొప్పున అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, ఓటరు కార్డును తీసుకురావాలని సూచించారు.ఈ పోటీల్లో నాన్ మెడలిస్టు క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అవకాశం ఉందని ఈ విషయాన్ని గమనించాలని నిర్వాహకులు కోరారు.